## రైతులకు అండగా ప్రభుత్వం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ చంద్రశేఖర్

కందుకూరు, నవంబర్ 6: ప్రభుత్వం రైతులకు అండగా ఉంటున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ దేవరశెట్టి చంద్రశేఖర్ తెలిపారు. మండల పీఏసీఎస్ ఆధ్వర్యంలో సోమవారం సొసైటీ ఆవరణలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ రైతుల సంక్షేమం కోసం పని చేస్తున్నట్లు వివరించారు. రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు, రుణాలను సకాలంలో అందజేస్తున్నట్లు చెప్పారు. వరి ధాన్యం ఏ గ్రేడ్ క్వింటాలుకు రూ, 2203, సాధారణ గ్రేడ్‌కు రూ.2183 లకు కొనుగోలు చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు సురుసాని శేఖర్‌రెడ్డి, నర్ల నర్సింహ, గానుగపేట అంజమ్మ, గౌర వెంకటేశ్, కొరివి యశోద, చంద్రు నాయక్, పొట్టి ఆనంద్, సీఈవో నిమ్మ యాదగిరిరెడ్డి, రాములు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శ్రీనివాసరావుకు అక్కినేని ఫిలిం ఫేర్ అవార్డు



ఎల్బీనగర్‌కు చెందిన ప్రముఖ సంఘ సేవకుడు, లయన్ కొలసాని శ్రీనివాసరావుకు నటసామ్రాట్ డాక్టర్ అక్కినేని ఫిలిం ఫేర్ అవార్డు లభించింది. నటసామ్రాట్ డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా నగరంలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో వీర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కొలసాని శ్రీనివాసరావుకు అక్కినేని ఫిలిం ఫేర్ అవార్డును ప్రదానం చేశారు. –మన్సూరాబాద్, నవంబర్ 6:

# బీజేపీ, కాంగ్రెస్‌లకు గుణపాఠం చెప్పాలి

- ఆ పార్టీల మాయమాటలు నమ్మొద్దు
- విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి
- అభివృద్ధికి ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరిక



విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్న బీజేపీ, కాంగ్రెస్ నాయకులు

బడంగ్‌పేట, నవంబర్6: ముఖ్య మంత్రి కేసీఆర్ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకులు గులాబీ గూటికి చేరుతున్నారని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సిర్లాహిల్స్, ప్రశాంత్ హిల్స్ కాలనీకి చెందిన బీజేపీ, కాంగ్రెస్ నాయకులు డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, కార్పొరేటర్ ధన లక్ష్మి రాజ్‌కుమార్, నవీన్ గౌడ్ ఆధ్వర్యంలో మంత్రి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. మంత్రి వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహేశ్వరం నియోజక వర్గం వ్యాప్తంగా బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఖాళీ అవుతున్నాయని అన్నారు. ఆ పార్టీలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. అభివృద్ధికి పట్టం కట్టాలన్న ఆలోచనలో ప్రజలు ఉన్నారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం అవుతుందని ప్రజలు నమ్ముతున్నారన్నారు. ప్రతి గడపకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ముఖ్య మంత్రి కేసీఆర్ నాయకత్వాన్ని అన్ని వర్గాల ప్రజలు కోరుకుంటున్నారన్నారు. ప్రజా సంక్షేమానికి కట్టు బడి పనిచేస్తున్నామని అందుకే ప్రజలు బీఆర్ఎస్ పార్టీ పై విశ్వాసం చూపుతున్నారన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి మరోసారి బీఆర్ఎస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపిస్తామన్నారు. పెయింటింగ్ అసోసియేషన్, వివిధ కుల సంఘాల నాయకులు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నారన్నారు. చందు, విఠల్, కన్న, రఘు, రాము, సురేశ్, పండు, రాజు, రాజేశ్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, రాజేశ్, కాంత్రి, నందు, రాహుల్, వినోద్, విజయ్, శైలెం, శేఖర్ యాదవ్, కార్తీక్, సాయి, తదితరులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, రాజ్ కుమార్, కోఆప్షన్ పల్లె జంగయ్య గౌడ్, ప్రవీన్, కృష్ణ తదితరులు ఉన్నారు.

**మంత్రి సబితా ఇంద్రారెడ్డి గెలుపు ఖాయం**

కందుకూరు, నవంబర్ 6 మంత్రి సబితా ఇంద్రారెడ్డి గెలుపు ఖాయమని జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, మాజీ ఎంపీపీ వట్నాల శోభ ఈశ్వర్‌గౌడ్ తెలిపారు. మండల పరిధిలోని బాచుపల్లి, ఊట్లపల్లి, పంతులు తండా, సార్లరావులపల్లి, బండమీది తండాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. మంత్రి సబితా ఇంద్రారెడ్డిని గెలిపిస్తే పేద ప్రజల సంక్షేమం కోసం పని చేస్తుందని అన్నారు. కాంగ్రెస్, బీజేపీల నాయకులు ప్రజలకు మాయమాటలు చెప్పి ఓట్లు వేయించుకున్న అనంతరం ముఖం చాటేస్తారని అందుకోసం వారి మాటలను నమ్మి మోసపోవద్దని కోరారు. సబితా ఇంద్రారెడ్డి గెలుపు కోసం పని చేస్తే నిరంతరం ప్రజల మధ్యన ఉంటూ సమస్యల పరిష్కారం కోసం పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో బాచుపల్లి సర్పంచ్ శ్రీనివాస్, ఎంపీటీసీ సురేశ్, జైత్వారం మాజీ సర్పంచ్ పర్వతాల్ యాదవ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఎలుక మేఘనాథ్‌రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు నర్సింహ, యూత్ అధ్యక్షుడు నరేశ్, పాల్గొన్నారు.

**అభివృద్ధికే పట్టం కట్టండి**

మహేశ్వరం, నవంబర్ 6: నియోజక వర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి పట్టం కట్టాలని పీఏసీఎస్ చైర్మన్ మంచె పాండు యాదవ్ అన్నారు. సోమవారం అమీర్‌పేట్, మాణిక్యమ్మగూడ, చిన్న తూప్ర గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ ఇంటింటికీ ప్రచారంలో నియోజక వర్గ కార్యదర్శి గుండెమోని అంజయ్య ముదిరాజ్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నాయకత్వంలో విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ప్రత్యేక చొరవతో మహేశ్వరం నియోజక వర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నారని అన్నారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు రాజకీయాలకు అతీతంగా ప్రతి గడపకు అందుతున్నాయని అన్నారు. మంత్రి చేస్తున్న అభివృద్ధి పనులే ఆమె గెలుపునకు బాటలు పడుతాయని అన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, బీసీసెల్ మండల అధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్ నాయకులు మంత్రి రాజేశ్, అంబయ్యయాదవ్, సుధాకర్‌రెడ్డి, కిష్టయ్యపాల్గొన్నారు.



పోచమ్మ తండాలో ప్రచారం నిర్వహిస్తున్న మాజీ ఎంపీపీ వట్నాల ఈశ్వర్‌గౌడ్



బాచుపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, శ్రీనివాస్, సురేశ్



చిన్న తూప్ర గ్రామంలో ప్రచారంలో పాల్గొన్న పీఏసీఎస్ చైర్మన్ మంచె పాండు యాదవ్

# ఇక సాఫీగా ప్రయాణం

- మీర్‌పేటలో రూ.112.41 కోట్లతో రోడ్లు అభివృద్ధి



జిల్లెలగూడ చందన చెరువు కట్ట నుంచి విస్తరించిన రోడ్డు

బడంగ్‌పేట, నవంబర్6: రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం కోట్ల రూపాయలు కేటాయించింది. లింక్ రోడ్లను అభివృద్ధి చేశారు. ప్రధాన రహదారులను విస్తరణ చేశారు. అధ్వానంగా మారిన రోడ్లను అద్దంలా తీర్చిదిద్దారు. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న రోడ్ల అభివృద్ధికి రూ.112.41 కోట్లు కేటాయించారు. హెచ్ఎండీఏ నుంచి రూ.33.91 కోట్లు, మున్సిపల్ జనరల్ నిధుల నుంచి రూ.20 కోట్లు, ప్రత్యేక నిధుల నుంచి రూ.50 కోట్లు, ఎల్ఆర్ఎస్ నిధుల నుంచి రూ. 8.50 కోట్లు కేటాయించారు. చందన చెరువు కట్ట రోడ్డు విస్తరణ, అంబేద్కర్ చౌరస్తా నుంచి అల్మాస్‌గూడ కమాన్ వరకు రోడ్డు విస్తరణ చేపట్టారు. బాలాపూర్ చౌరస్తా నుంచి బడంగ్‌పేట కమాన్ వరకు రోడ్డు విస్తరించారు. ప్రశాంత్ హిల్స్ చౌరస్తా నుంచి టీచర్స్ కాలనీ వరకు రోడ్డు విస్తరణ చేశారు. కమలానగర్ నుంచి నందన వనం వరకు రోడ్డు అభివృద్ధి చేశారు. లెనిన్ నగర్ కట్ట రోడ్డు విస్తరణ చేసిన ఇబ్బందులు వస్తుండటంతో లింక్ రోడ్డు ఏర్పాటు చేశారు. గతంలో అస్తవ్యస్తంగా ఉన్న రోడ్లను అద్దంలా తీర్చిదిద్దారు. గంటల తరబడి ట్రాఫిక్ జామ్ అవుతుందన్న ఉద్దేశంతో విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ప్రత్యేక నిధులు, ఎల్ఆర్ఎస్, హెచ్ఎండీఏ నుంచి అధిక నిధులు తీసుకొచ్చి రోడ్లను అభివృద్ధి చేయడానికి కారణ భూతమయ్యారు. గతంలో మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ అనేది చిన్న గ్రామంగా ఉండటంతో చిన్న చిన్న రోడ్లు ఉండేవి. మున్సిపల్ కార్పొరేషన్ అయిన తర్వాత రోడ్ల విస్తరణకు మోక్షం వచ్చింది. ప్రభుత్వం అవసరం అయిన నిధులు కేటాయించడంతో పనులు చక చకా సాగుతున్నాయి. ప్రయాణం సులభ తరం అయింది.

**తప్పిన ట్రాఫిక్ ఇక్కట్లు**

గతంలో మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నిత్యం ట్రాఫిక్ సమస్యతో ప్రయాణికులు ఇబ్బందులు పడేవారు. గంటల తరబడి ట్రాఫిక్ జామ్ కావడంతో నగరానికి వివిధ పనులపై, ఉద్యోగాల కోసం పోయేవారు ఇబ్బందులు పడేవారు. రోడ్ల విస్తరణ చేసిన తర్వాత ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టినట్లయింది. ప్రధాన కూడళ్లు విస్తరణ చేసి అభివృద్ధి చేశారు. విద్యార్థులకు, ఉద్యోగులకు ఉపశమనం కలిగింది.